01ATP13_01ATP13.qxd 13-10-2024 PM 10:08 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 14 అక్టోబర్ 2024 పేజీలు : 04

# అత్తాకోడలిపై నలుగురు సామూహిక అత్యాచారం

- భర్తలను కత్తులతో భయపెట్టి అఘాయిత్యం
- రూ.5 వేలతో పాటు రెండు కీప్యాడ్ మొబైళ్లు అపహరణ
- బాధితులు బళ్లారి వాసులుగా గుర్తింపు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి రత్న
- కేసు నమోదు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి రత్న, పోలీసు సిబ్బంది


సిసి కెమెరాలో రికార్డు అయిన దుశ్చర్యకు దారితీసిన అఘంతకుడి చిత్రం

**చిలమత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని నల్లబొమ్మనపల్లి గ్రామానికి సమీపంలో నిర్మాణంలో వున్న ఆర్‌ఎస్ పేపర్ మిల్లులో అత్తాకోడలిపై నలుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో చోటు చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాలు ఇలా వున్నాయి. గత ఐదు నెలల క్రితం బళ్లారి నగరం కవులు బజారుకు చెందిన దాదాపీర్, కుమారుడు మహమ్మద్‌హుస్సేన్‌లు వారి భార్యలతో కలిసి ఉపాధి నిమిత్తం నల్లబొమ్మనపల్లి వద్ద నిర్మాణంలో వున్న ఆర్‌ఎస్ పేపర్ మిల్లులో వాచ్‌మెన్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి 1 గంట సమయంలో పరిశ్రమ అవతల రోడ్డుపై రెండు ద్విచక్రవాహనాల్లో ఐదు మంది గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి మృగాళ్లా ఎగబడి కత్తులతో చంపేస్తామని హుస్సేన్, దాదాపీర్‌లను బెదిరించి అక్కడున్న వారి భార్యలపై పైశాచికంగా నలుగురు అత్యాచారానికి పాల్పడి బాధితుల నుండి 5 వేల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు అపహరించిన కేటుగాళ్లు సిసి కెమెరాలను పగులగొట్టి సంఘటనా స్థలం నుండి ఉడాయించారు. బాధిత మహిళలు తమ భర్తలతో చిలమత్తూరు పోలీసుస్టేషన్‌కు శనివారం ఉదయం రావడంతో అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళలకు మెరుగైన వైద్యం కోసం పోలీసులు హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అత్యాచార ఘటన వార్త ప్రజలకు తెలియడంతో ఒక్క సారిగా జిల్లా ఉలిక్కి పడింది. అత్యాచార ఘటనపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఎస్‌పికి ఫోన్ చేసి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి రత్న సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీసి జాగిలాలతో నిందితుల ఆచూకి కోసం గాలించాలని సిబ్బందిని సీరియస్‌గా ఆదేశించారు. బాధిత మహిళలకు, వారి కుటుంబానికి రక్షణగా వుంటామని నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిలమత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా మంత్రి సవితతో పాటు ఎంపి బికె పార్థసారధితో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

## అత్తా కోడలిపై భర్తల ముందే

# గ్యాంగ్‌రేప్

- దసరా పండుగరోజు దారుణం
- సిఎం, హోంమంత్రి సీరియస్
- పోలీసుల అదుపులో నిందితులు



**హిందూపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

శ్రీసత్యసాయ జిల్లా హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలంలోని నల్లబొమ్మనపల్లిలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంమంత్రి అనిత వెంటనే స్పందిస్తూ నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని రాయలసీమ రేంజ్ డిఐజి, ఎస్‌పిలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో జిల్లా ఎస్‌పి రత్న నేతృత్వంలో నాలుగు స్పెషల్ టీంలు రంగంలోకి దిగాయి. సంఘటనా స్థలంలో సిసి ఫుటేజి ఆధారంగా నేరం జరిగిన 24 గంటల్లోపే ఐదుగురు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నగరానికి చెందిన కౌలుబజార్ నుండి కొన్ని నెలల క్రితం చిలమత్తూరు మండలంలో నిర్మాణంలో వున్న ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా పొట్టకూటి కోసం వలస వచ్చి చేరారు. ఈ నేపథ్యంలో హిందూపురం పట్టణానికి చెందిన నేర చరిత్ర కలిగిన దుండగులు, ముగ్గురు మైనర్లు ద్విచక్రవాహనాల్లో ఫ్యాక్టరీ ప్రాంతానికి వెళ్లి అత్తాకోడలిపై అత్యాచారానికి పాల్పడ్డారు. తండ్రి, కొడుకుని చితకబాది చంపుతామని ఇద్దరు వ్యక్తులు బెదిరిస్తుండగా నలుగురు నిందితులు అత్తాకోడలిపై అత్యాచారం జరిపారు. ఈ దుర్ఘటన దసరా పండుగ రోజు తెల్లవారుజామున చోటు చేసుకోవడం ప్రజల్లో విషాదాన్ని రేకెత్తించింది. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంమంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్లు చేసి నేరస్తులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆదేశాలిచ్చారు. సమాచారం అందుకున్న ఎస్‌పి రత్న హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు నిందితులు ఘటనలో పాల్గొనగా ఐదుగురు పోలీసుల అదుపులో వున్నారు. మరొక నిందితుని కోసం గాలిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సోమవారం హిందూపురంలో జిల్లా ఎస్‌పి మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ వివరాలు వెల్లడించనున్నట్లు తెలిసింది. కాగా టిడిపి, వైసిపి మధ్య గ్యాంగ్‌రేప్ ఘటన విమర్శలు, ప్రతి విమర్శలకు దారి తీసింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌డిఎ కూటమి హయాంలో ఆడవాళ్లకు రక్షణ లేదని గ్యాంగ్‌రేప్‌లు, హత్యలు పెచ్చురిల్లి పోయాయని జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషాశ్రీ, నియోజకవర్గం ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డిలు విమర్శించారు. దీనికి కౌంటర్‌గా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాకం వల్లే నేరాలు ఇప్పటికీ జరుగుతున్నాయని ఘాటుగా విమర్శించారు. కాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు వైసిపి నాయకులకు పోలీసులు ఎంట్రీ ఇవ్వలేదు. మంత్రి సవితమ్మ, ఎంపి పార్థసారధి, టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్పలు మాత్రమే పరామర్శించారు. మహిళలైన తమకు బాధితుల పరామర్శకు ఎందుకు అనుమతి ఇవ్వడంలేదని వైసిపి అధ్యక్షురాలు ఉషశ్రీ, దీపిక వేణురెడ్డిలు డిఎస్‌పి మహేష్‌తో వాగ్వివాదానికి దిగారు. తదుపరి మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు.


ఘటన వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి రత్న

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది..!

- మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలకు అంతం లేదా?
- టీడీపీ కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది
- మహిళలకు రక్షకుడినై నిలబడతానన్న జనసేనాని పవన్ ఏం చేస్తున్నారో
- ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైదని హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం నల్లబొమ్మినిపల్లెలో ఇద్దరు మహిళలపై జరిగిన గ్యాంగ్ రేప్ మరోమారు ఈ విషయాన్ని నిరూపించిందని ఆ ఘటన అత్యంత అమానుషం, దారుణమని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి అన్నారు. గ్యాంగ్ రేప్ ఘటనపై ఆదివారం ఆయన తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా విజయదశమి పర్వదినాన్ని జరుపుకొంటుంటే ఆదిశక్తిగా కొలవబడే మహిళలకు మాత్రం పండగరోజు కాళరాత్రిగా మారిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోవడం అత్యంత దారుణమని, ఇద్దరు మహిళలపై గ్యాంగ్ రేప్ అత్యంత దుర్మార్గమని అన్నారు. చిత్తూరు జిల్లాలో బాలిక హత్య ఘటన మరువకముందే హిందూపురం నియోజకవర్గంలో గ్యాంగ్ రేప్ ఘటన దేశంలోనే సంఛనలం రేపిందన్నారు. వరుస ఘటనలు చూస్తుంటే రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడుందో అర్థం కావడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, వారు చేతులు కట్టుకొని నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్థిస్తున్నారని విమర్శించారు. గ్యాంగ్ రేప్ నిందితులను కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో చిన్నారులకు, మహిళలకు భద్రత, రక్షణ కల్పించేందుకు తాను ఒక రక్షకుడిగా నిలబడతానని ఎన్నికల ముందు ప్రగల్బాలు పలికిన జనసేనాని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎక్కడున్నారు, ఏం చేస్తున్నారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న వరుస అఘాయిత్యాలు ఎందుకు కనబడటం లేదన్నారు. పవన్‌కళ్యాణ్ సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో దళిత బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశారని ఆ ఘటన ఆయన తెలుసా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అయితే అందులో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయన్నారు. నేరాలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నోరు విప్పాలని, ఇలాంటి ఘటనలపై పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సభ్య సమాజం తల దించుకునేలా జరుగుతున్న వరుస ఘటనలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని శాంతి భద్రతలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ మానవ హక్కుల కమీషన్, మహిళా కమీషన్ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అఘాయిత్యాలపై గట్టిగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ రమణయాదవ్, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, డీసీఎంఎస్ మాజీ ఛైర్మెన్ జయచంద్రనాయుడు, నాయకులు నాగేశ్వరరావు, జయేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, చెన్నబసన్నగౌడ్, శివలింగ, తిరుపాల్ యాద్, రాంబాబు, సూరి, మహాలింగ, రామచంద్ర, లాలెప్ప, గురుస్వామి, కేశన్న, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

## మద్యం టెండర్‌దారులకు

# జెసి ప్రభాకర్‌రెడ్డి మాస్ వార్నింగ్

- రేయ్ ఊర్లు వదలాల్సిందే..
- మండలానికి 15 శాతం వాటా ఇవ్వాల్సిందే..
- 20శాతం వాటా జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఇవ్వాల్సిందే..
- తాడిపత్రి అభివృద్ధే మా లక్ష్యం


మాట్లాడుతున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

**అనంతపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త బ్యూరో**

మాజీ మంత్రి, సీనియర్ నేత జేసి దివాకర్‌రెడ్డి సోదరుడైన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి మద్యం టెండర్ దారులకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు మండలానికి చెందిన పలువురు మద్యం టెండర్‌దారులను హెచ్చరిస్తూ మాస్ వార్నింగ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధి కోసం టెండర్ దక్కించుకున్న వారు ఎవరైనా 15పైసలు వాటా నిధులు ఆదాయంలో మండలానికి ఇవ్వాల్సిందే. ఇందుకు మేము ఎలాంటి పెట్టుబడి పెట్టం. 20 పైసలు శాతం వాటా డబ్బులు జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఇవ్వాల్సిందే..ఇందుకైతే ఎంతనా పెట్టుబడి పెడతాం. ఇందుకు ఎన్ని కోట్లైనా పెట్టుబడి ఇస్తాం.. ఇష్టానుసారం ఇతర నియోజకవర్గం వారు కూడా ఎట్లా టెండర్లు దాఖలు చేస్తారు, రేయ్..ఊర్లు వదలాల్సిందే.. మీరో మేమో తేల్చుకుందామంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి ఒక వీడియో ద్వారా హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. మద్యం షాపుల నిర్వహణకు సంబంధించి టెండర్లు దాఖలు ప్రక్రియ పూర్తి అయింది. ఈ నేపథ్యంలో దసరా పండుగ రోజు శనివారం ఒక వీడియో ద్వారా జేసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడిన మాటలు, హెచ్చరికలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తాడిపత్రి నియోజకవర్గం అభివృద్ధి కోసం సొంతంగా ఈ డిసెంబర్ నాటికి 3 కోట్ల రూపాయలు చూపిస్తా.. వచ్చే సంవత్సరం డిసెంబర్ నాటికి 10 కోట్ల నిధులు సొంతంగా చూపిస్తా.. మద్యం షాపులు ఎవరేసినా తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి 15 శాతం నిధులు ఇవ్వాల్సిందే అంటూ జేసి ప్రభాకర్‌రెడ్డి హుకుం జారీ చేశారు. పామిడికి చెందిన గౌడ్ అనే వ్యక్తి మద్యం టెండర్లు దాఖలు చేశారని పక్క నియోజకవర్గానికి చెందిన ఆ వ్యక్తి ఎలా టెండర్లు వేస్తారు, ఒక మాజీ ఎమ్మెల్యేని పిలిపించుకో ఎలా నడుపుతావో చూస్తానంటూ జేసి హెచ్చరికలు చేశారు. అలాగే పెద్దవడుగూరు మండలానికి చెందిన రామచంద్ర, ప్రకాష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శరబరెడ్డి తదితర వ్యక్తుల పేర్లను ప్రస్తావిస్తూ ఎట్లా టెండర్లు దాఖలు చేస్తారంటూ జేసి ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఎన్నో కష్టాలు పడ్డామని, ఇప్పుడు వచ్చి టెండర్లు దాఖలు చేసుకునేందుకు ముందుకొచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఇక్కడ జోక్యం చేసుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మొన్నటి వరకు మా అన్న కాళ్ల వద్ద ఉన్న వాళ్లు కూడా ఇప్పుడు మద్యం టెండర్లు దాఖలు చేసేందుకు ముందుకొచ్చారని ఆక్రోశం వ్యక్తం చేశారు. 1952లోనే మా నాన్న జేసి నాగిరెడ్డి, ఎమ్మెల్యేగా నిలబడ్డారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు తాడిపత్రి ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా తాము పని చేస్తూ వచ్చామని గత ఐదేళ్లలో లారీలు, బస్సులు అన్ని పోగొట్టుకున్నామని ఆయన వెల్లడించారు. మద్యం షాపుల టెండర్లు దక్కించుకున్న వారు ఎవరైనా తాడిపత్రి అభివృద్ధికి 15పైసలు మండలానికి, 20 శాతం పైసలు జేసికి వాటా నిధులు ఇవ్వాల్సిందే నంటూ అల్టిమేటం జారీ చేశారు. ఈ విధంగా పలు విషయాలు ప్రస్తావిస్తూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి మద్యం టెండర్ దాఖరులను హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలుచర్చనీయాంశంగా మారాయి. సోమవారం మద్యం టెండర్లకు సంబంధించి లాటరీల ద్వారా ఎంపిక చేయనున్నారు. ఆయా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏ షాపు ఎవరికి దక్కుతుందన్నది సోమవారం తేలనుంది. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో టెండర్లు దాఖలైన దరఖాస్తులను పరిశీలిస్తే.. తాడిపత్రి నియోజకవర్గంలో తక్కువగానే టెండర్లు వేశారు. జేసి ప్రభాకర్‌రెడ్డి వీడియో ద్వారా చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే పెద్దవడుగూరు మండలంలో కూడా కొన్ని పోటీగా దరఖాస్తులు పడినట్లు అర్థం అవుతోంది.

**గతంలో ఇసుక సరఫరాలో కూడా జేసి మాస్ వార్నింగ్ :**

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి కొద్ది నెలల క్రితం గుండెకు సంబంధించి హైదరాబాద్‌లో చికిత్సలు చేసుకుని వైద్యుల సూచనల మేరకు నెలన్నరపాటు హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఈ మధ్యనే హైదరాబాద్ నుంచి తాడిపత్రికి వచ్చారు. జేసి ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఒకవైపు విశ్రాంతి తీసుకుంటూనే మరోవైపు రెండు వీడియోల ద్వారా ఇసుకను అక్రమంగా సరఫరా చేసే సొంత పార్టీలోని టిడిపి స్థానిక నాయకులకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. తాడిపత్రి నియోజకవర్గంలో పెన్నా నది నుంచి ఎవరూ అక్రమంగా ఇసుకను తరలించ రాదని, అలా తరలిస్తే చర్యలు తప్పవని జేసిబిలు, లారీలను సీజ్ చేయిస్తానని అప్పట్లో జేసి ప్రభాకర్‌రెడ్డి వీడియో సందేశం ద్వారా చేసి హెచ్చరికలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఈ విధంగా హెచ్చరికలు చేసినప్పటికీ ఇసుక అక్రమరవాణా జరుగుతుండటంతో తాడిపత్రి ఎమ్మెల్యే జేసి అస్మిత్‌రెడ్డి తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట స్థానిక పోలీసు అధికారుల చర్యలను నిరసిస్తూ ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఏది ఏమైనా మద్యం టెండర్‌దారులను హెచ్చరిస్తూ తనదైన శైలిలో జేసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడిన మాటలు చర్చనీయాంశంగా మారింది.

# గత ప్రభుత్వం వల్లనే గంజాయి బ్యాచ్ అరాచకాలు

- గ్యాంగ్‌రేప్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- బాధితులను పరామర్శించిన మంత్రి సవితమ్మ

4 ►

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

అరేబియా సముద్రం మధ్యలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 14,15,16 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వుండాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. రాయలసీమ, కోస్తా ఆంధ్రా ప్రాంతాలతో పాటు కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని అంచాన వున్న నేపథ్యంలో జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యేనప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేషన్ కమీషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణాలు, పల్లెల్లో కాలువ, డ్రైనేజీ మార్గాలను వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. నీటిని పరిశీలించేందుకు డ్రోన్లు వినియోగించి నీటి ప్రవాహ మార్గాలను పర్యవేక్షించనున్నారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు వర్షం నీటి ప్రవాహాన్ని అడ్డుకోకుండా చర్యలు చపట్టాలన్నారు. తోటల వ్యవసాయశాఖ అధికారులు రైతులు తమ పంటలను రాబోయే వర్షాల నుండి ఎలా సంరక్షించుకోవాలో సూచనలు అందిస్తున్నారని పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. జలవనరుల శాఖ అధికారులు రిజర్వాయర్లు, కాలవల్లో నీటి మట్టం పర్యవేక్షించడానికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అన్ని మండలాల తహాశీల్దార్లు, జిల్లా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుండాలని ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## నేడు కొత్త మద్యం దుకాణాలకు ఓపెన్ లాటరీ

**అనంతపురం ఓల్డ్‌టౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

నూతన మద్యం పాలసీలో భాగంగా అనంతపురం జిల్లాలోని 136 మద్యం దుకాణాలకు సోమవారం జెఎన్‌టియులోని ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో ఓపెన్ లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు చేపట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమీషనర్ నాగమద్దయ్య తెలిపారు. ఓపెన్ లాటరీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ మునిస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలకు జెఎన్‌టియులోని ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో 136 దుకాణాలకు సంబంధించి 3261 దరఖాస్తులు అందాయని ప్రతి ఒక్క షాపుకు మూడేసి చొప్పున లాటరీ తీసి మొదటగా లాటరీ తగిలిన వ్యక్తికి షాపు అప్పగిస్తామన్నారు. మిగిలిన రెండు లాటరీలు అదనంగా వుంచుకుంటామని ఆయన తెలిపారు. లాటరీ ప్రక్రియ జిల్లా కలెక్టర్ సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. లాటరీ ప్రక్రియ నిర్వహణ కోసం ప్రత్యేక ఎంట్రీ ఎగ్జిట్స్ పాయింట్లు ఏర్పాటు చేశామని దుకాణ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు మాత్రమే ఆడిటోరియంలోకి అనుమతిస్తామని ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని సూచించారు. దరఖాస్తుదారు లాటరీ ప్రక్రియకు రాలేని పక్షంలో తన ప్రతినిధిని పంపవచ్చని తెలిపారు. ఓపెన్ లాటరీ ప్రక్రియకు భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా కేంద్రం ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించి 41 షాపులకు గాను 1290 దరఖాస్తులు, బుక్కరాయసముద్రంకు సంబంధించి 15 షాపులకు గాను 542, గుత్తికి సంబంధించి 18 షాపులకు గాను 239, గుంతకల్లుకు సంబంధించి 14 షాపులకు గాను 187, తాడిపత్రికి సంబంధించి 16 షాపులకు గాను 101, ఉరవకొండకు సంబంధించి 7 షాపులకు గాను 255, కనేకల్‌కు సంబంధించి 6 షాపులకు గాను 146, రాయదుర్గంకు సంబంధించి 8 షాపులకు గాను 231, కళ్యాణదుర్గం 7, కంబదూరు పోలీసుస్టేషన్‌కు సంబంధించి 4 షాపులకు 193 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు.

# ఏపిలో మహిళల మానప్రాణాలకు రక్షణ కరువు

- అత్యాచార బాధితుల పరామర్శకు రాని బాలయ్య - వైసిపి జిల్లా అధ్యక్షురాలు, ఇన్‌చార్జ్ విమర్శలు

**హిందూపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళల మాన ప్రాణాలకు రక్షణ కరువైందని వైసిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ, హిందూపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి తీవ్రంగా విమర్శించారు. చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి గ్యాంగ్‌రేప్ బాధితులను పరామర్శించేందుకు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని వైసిపి నాయకులు నిర్ణయించగా పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో వారు నేరుగా డిఎస్‌పి మహేష్ వద్దకు వెళ్లి చర్చించారు. సాటి మహిళలకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకుని ఒక పార్టీ నాయకురాళ్లుగా పరామర్శించేందుకు వెళ్లాలనుకుంటే ఎందుకు అభ్యంతరం చెబుతారని డిఎస్‌పిని ప్రశ్నించారు. పోలీస్ విచారణ జరుగుతోందని ఎవరిని అనుమతించడం లేదని డిఎస్‌పి వారికి సమాధానం ఇచ్చారు. దీంతో వారు కార్యాలయం వెలుపలకు వచ్చి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. అత్యాచారం జరిగి రెండు రోజులు అవుతున్నా ఇంతవరకు బాధితులను పరామర్శించేందుకు బాలకృష్ణ హిందూపురంకు రాలేదని నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో దిశ యాప్ ద్వారా ఇలాంటి దారుణ సంఘటనలు తెలిసిన వెంటనే ముందస్తుగా పది నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుని నేరాలను నియంత్రించామన్నారు. దిశ పోలీసుస్టేషన్లను పునరుద్దరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తమ నేత జగన్‌ను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకుని పరిపాలనను భ్రష్టు పట్టించారన్నారు. గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన నేరస్తులను పోలీసులు వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, ఎంపిపి పురుషోత్తంరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


డిఎస్‌పితో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

02ATP27_02ATP27.qxd 13-10-2024 PM 10:13 Page 1



# అంగరంగవైభవంగా శ్రీచౌడేశ్వరి ఆలయంలో ముగిసిన ఉత్సవాలు

## - శమీ పూజలో పాల్గొన్న రామానందన్

లేపాక్షి, అక్టోబర్ 13 ప్రభాతవార్త


శ్రీచౌడేశ్వరిదేవి విగ్రహాన్ని జమ్మిచెట్టు వద్దకు తీసుకెళుతున్న దృశ్యం

మండలంలోని చోళసముద్రంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తజన సందోహం నడుమ అంగరంగ వైభవంగా ముగిశాయి. గత 9 రోజులుగా శ్రీచౌడేశ్వ రిదేవి ఆలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లేపాక్షి వీరభద్రాలయం కమిటీ చైర్మన్ రామానందన్ నేతృత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రీచౌడేశ్వరిదేవిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. శనివారం ఉదయం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు.


జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న రామానందన్

సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని జమ్మి చెట్టు వరక తీసుకెళ్లారు. ఈ ఊరేగింపులో రామానందన్‌తో పాటు వైఎస్ఆర్సిపి కన్వీనర్ నారాయణస్వామి, గ్రామ పెద్దలు ప్రభాకర్‌రెడ్డి, జయచంద్ర, అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద కరణం రామానందన్ ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మి చెట్టుపై విల్లును ఎక్కు పెట్టారు. ఈ సందర్భంగా మంత్రోచ్చారణల మధ్య 8 దిక్కులకు 8 బాణాలు సంధించి జమ్మి చెట్టు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రిష్టప్ప, పిసి మోహన్, చెన్నకృష్ణ, అనిల్‌కుమార్, సురేంద్ర, నంజుండప్ప, ఈశ్వర్, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# వీరభద్రాలయంలో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

## - హాజరైన భక్తులకు రామానందన్ భారీ ఎత్తున అన్నదానం

లేపాక్షి, అక్టోబర్ 13 ప్రభాతవార్త


లేపాక్షిలో శమీ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి వీరభద్రాలయంలో దసరా ఉత్సవాలు శనివారం ముగిశాయి. 9 రోజుల పాటు వీరభద్రాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవిని నవరాత్రుల్లో వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రతి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని దుర్గాదేవి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. హాజరైన భక్తులకు రామానందన్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస్‌కుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన రహదారి, రాజవీధి మీదుగా ప్రధాన రహదారి గుండా నంది విగ్రహం ప్రాంగణంలోని జమ్మి చెట్టు వరకు అమ్మవారిని ఊరేగించారు. జమ్మి వద్ద అర్చకులు వేదమంత్రాలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కరణం రామానందన్ జమ్మి చెట్టుకు విల్లమ్ములు ప్రయోగించే కార్యక్రమంతో దసరా ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ జయప్ప, నాయకులు ఆనంద్‌కుమార్, వెచ్చం రవీంద్రనాథ్, సర్పంచు సిద్ధార్థ, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, పురావస్తుశాఖ సహాయకులు రాము, దేవాదాయ శాఖ సహాయకులు మల్లికార్జున, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రేప్ చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

చిలమత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త


వినతిపత్రం అందచేస్తున్న సిపిఎం నాయకులు

చిలమత్తూరు మండలం టేకులోడు పంచాయతీ బొమ్మన పల్లి వద్ద వున్న ఆర్ఎన్ పరిశ్రమలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ నాయకులు ఎస్ఐకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పరిశ్రమల వద్ద సరైన భద్రత వున్నప్పుడే కూలీలను పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసుకోవాలని కానీ పరశ్రమ యాజమాన్యం అలాంటి భద్రత కల్పించలేదన్నారు. కావునా యాజమాన్యంపై కేసు మోదు చేయాలన్నారు. మండలంలోని అనేక పరిశ్రమల వద్ద ఇలాంటి పరిస్థితి వుందని కావునా వాటిని పరిశీలించి రక్షణ, భద్రతప్రమాణాలు పాటించేలా చర్యలుతీసుకోవాలన్నారు. పోలీసులు సీరియస్‌గా తీసుకుని దుండగులను పట్టుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు నరసింహులు, మంజునాథ్, కోరారు.

# మల్లేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

## - ఆలయంలో ఘనంగా విజయదశమి పూజలు

కంబదూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త


ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వర స్వామి, పార్వతి అమ్మవారు

మండల వ్యాప్తంగా విజయదశమి (దసరా) పండుగ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని కంబదూరు పురాతన కమల మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవత మూర్తులు విగ్రహాలను వెండి ఆభరణాలతో అలంకరించారు. ఉదయం నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధానంగా ఆలయంలోని పార్వతి అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. పండుగ కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యటకులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంలో ఆనవాయితీగా వస్తున్న ఎద్ల బండి పోటీలు నిర్వహించారు.

ఆలయానికి భక్తులు పోటెత్తిన దృశ్యం



# విజయదశమి సందర్భంగా మార్కాండేయ స్వామికి ప్రత్యేక పూజలు

కుందుర్పి, అక్టోబర్ 13 ప్రభాతవార్త


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తాదులు

కుందుర్పి మండల కేంద్రంలో వెలసిన శ్రీ మార్కాండేయ స్వామి దేవాలయంలో విజయదశమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విజయదశమి సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల సమయంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను మార్కాండేయ స్వామి దేవాలయం నుంచి దిగువ గేరి జమ్మి చెట్టు వరకు మహిళలు జ్యోతులు పట్టుకుని ఊరేగింపు చేశారు. ప్రతి ఏటా ఈ ఊరేగింపులో కర్ణాటక, ఆంధ్ర భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొంటారని మార్కాండేయ స్వామి దేవాలయ అర్చకులు తెలిపారు.

# మద్యం టెండర్ వేసిన వారికి బెదిరింపులు..?

కంబదూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త

కంబదూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల కోసం టెండర్‌రూపంలో 50దరఖాస్తులు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. అయితే మద్యందుకాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రాజకీయ నేతలు నుండి బెదిరింపులు వస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్ వేసిన వ్యక్తులకు నేరుగా రాజకీయ నాయకులు ఫోన్ చేసి టెండర్‌ను వెనక్కి తీసుకోవాలని హుకుం జారీ చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. లేకపోతే మద్యం షాపులు ఏ విధంగా నడుపుతారు మేము చూస్తామని మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో టెండర్ వేసిన వ్యాపారస్తులు తలలు పట్టుకుంటున్నారు. టెండర్ దక్కితే వాటా ఇవ్వాలని దౌర్జన్యాలకు దిగుతున్నారని టెండర్ వేసిన వ్యక్తులు చెప్పకనే చెబుతున్నారు. మరి మద్యం టెండర్ల విషయంలో చివరికి ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# వైసీపీ నాయకుల దాడిలో గాయపడ్డ టీడీపీ కార్యకర్తను పరామర్శించిన టిడిపి సీనియర్ నాయకులు

శెట్టూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త


గాయపడ్డ కార్యకర్తలను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

శనివారం రాత్రి తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉన్న సమయంలో చూసిన వైసీపీ నాయకులు ఈశ్వరప్పపై మూకుమ్మడిగా దాడి చేయడంతో కుటుంబ సభ్యులు గాయపడ్డ ఈశ్వరమ్మను ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు దాడిలో గాయపడ్డ టిడిపి కఆర్యకర్త ఈశ్వరప్పను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రామరాజు, పట్టణ అధ్యక్షులు శర్మస్‌వలి, నాయకులు నరసాపురం మురళీ, మ ఆజీ కన్వీనర్ డిష్ మురళీ, సునీల్, రెహమాన్, క్రైరేవు టీడీపీ నాయకులు కరెన్నలతో కలిసి ఆదివారం పరామర్శించారు. అనంతరం గాయపడ్డ కార్యకర్త ఆరోగ్య పరిస్థితులను వైద్యులతో అడిగి తెలుసుకున్నారు.

# వాల్మీకి జయంతి వేడుకలకు సహకరించాలి

## - వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి

డి.హీరేహాళ్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:


మహర్షి వాల్మీకి జయంతి వేడుకలపై చర్చిస్తున్న ఆ సంఘం అధ్యక్షులు, సభ్యులు


ఎమ్మెల్యే కాలవకు మెమొరడం అందజేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు సభ్యులు

ప్రభుత్వ లాంఛనాలతో ఈ నెల 17న రాష్ట్ర మంతటా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను జరుపుకొనున్నారని రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప కమిటి సమావేశంలో తన అభిప్రా యం తెలిపారు. ఆదివారం రాయదుర్గం పట్టణంలోని కోటలో మారెమ్మ దేవాలయం వద్ద ఉన్న వాల్మీకి నూతన కళ్యాణ మండపంలో ఆ సేవా సమితి కార్యదర్శి ఎన్‌టి.సిద్దప్ప, ఉపాధ్యఉలు మలకన్న, పైతోట రఘు, ప్రధాన సలహాదారు లు తలారి రాజప్ప, సభ్యులు మురళి, మాజీ కౌన్సిలర్ తిప్పేస్వామి, గోనబావి శ్రీనివాసులు, గంగాధర, పైతోట ముత్తయ్య తదితరులతో కలిసి మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను జరుపుకోవాల్సిన విధానం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సమావేశంలో సభ్యులతో చర్చిస్తూ ఈ నెల 17వ తేదీన మహర్షి ఉత్సవాలు సాధారణంగా జరుపుకుందామన్నారు. నవంబర్ మాసం మొదటి వారంలో కళ్యాణ మండపం ప్రారంభోత్సవంతో పాటు జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకుందామని సభ్యుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకున్నారు. కళ్యాణ మండపంలో పునరుద్దరణ పనులు మరో 15రోజుల్లో పూర్తి కానున్నాయని, అందులోనూ కార్తీకమాసం కావడం మంచి రోజులున్నాయని, అప్పుడే మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొని కళ్యాణ మండపం ప్రారంభించుకుందామని పలువురు సభ్యులు సమావేశంలో తెలపడంతో అందరూ ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రాయదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే కాలవను వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి, ఉపాధ్యక్షులు, ఇతర సభ్యులతో కలిసి ఎమ్మెల్యే నివాసంకు చేరుకుని సమావేశంలో చర్చించి తీసుకున్న ఏకాభిప్రాయం నిర్ణయంను ఆయన దబుష్టికి తీసుకెళ్లారు. అనంతరం వాల్మీకి కళ్యాణమండపం పునరుద్దరణ పనుల విషయాలను వివరించి వాటర్ పైపుడైవర్ట్ చేయు విషయమై చర్చించి కళ్యాణ మండపం పురోగతికి ఎంపి నిధులు కేటాయించేలా సహకరించి స్థానిక ఎమ్మెల్యేగా ఆర్థికపరంగా మీ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశానికి ఆ సేవా సమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, రాయుడు, సభ్యులు అజయ్‌టైలర్ రఘు, సిద్దలింగప్ప, రాముడు, చంద్ర, ఎలక్ట్రిషన్ సిద్దప్ప, దేవేంద్ర తదితరులు హాజరయ్యారు.

# మున్సిపల్ కార్యాయలంలో కమండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రాయదుర్గం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

రాబోవు ఐదు రోజుల్లో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో పురపాలక సంఘంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు వర్షం వచ్చినప్పుడు మీకు ఎలాంటి సమస్యలు ఎదురైనా కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9154566253ని సంప్రదించాలని ఆయన కోరారు.

# మంత్రికి జలసాధన సమితి వినతి


మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త

రాష్ట్ర బిసి సంక్షేమశాఖామంత్రి సవితమ్మకు ఆదివారం జలసాధన సమితి నాయకులు హిందూపురంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్లో 1.10 టిఎంసిల నీరు నిల్వ వున్నప్పటికి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు వదలడం లేదని గతంలో వర్షాల వల్ల కాలువ పూడిక పేరుకపోయి కంపచెట్లతో నిండి నీరు ప్రవహించడానికి అడ్డంకిగా వందని కావునా వెంటనే కాలువ పూడిక తీసి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షులు ధనాపురం వెంకటరామిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఈ మూడు రోజులు తుఫాన్‌తో జర జాగ్రత్త

## - గోరంట్ల మండలంలో 2 పునరావాస కేంద్రాలు ఏర్పాటు

## - అధికారులను అప్రమత్తం చేసిన పుట్టపర్తి ఆర్డీఒ సువర్ణ

గోరంట్ల, అక్టోబర్ 13 ప్రభాతవార్త


పాత్రికేయులతో మాట్లాడుతున్న ఆర్డీఒ సువర్ణ

ఈ నెల 14,15,16 తేదీల్లో భారీ వర్షాలతో కూడిన తుఫాన్ ప్రభావం వుండబోతోందని ముందస్తు నివారణ చర్యల కోసం అన్ని శాఖల అధికారులు సంసిద్ధంగా వుండాలని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పుట్టపర్తి ఆర్డీఒ సువర్ణ అధికారులను ఆదేశించారు. ఆదివారం గోరంట్ల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఒ మాట్లాడుతూ చెరువులు, కుంటలు లీకేజీలు, చెరువు కట్టల మరమ్మతులు వంటి వాటిపై ఇరిగేషన్ శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. అలాగే పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, కార్యదర్శులు రోడ్ల మరమ్మతులు, డ్రైనేజిల క్లీనింగ్ వంటి వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఇందులో భాగంగా గోరంట్ల పట్టణ చివర క్రెడ్స్ పాఠశాల, బూదిలి వద్ద గత మఠంను సిద్ధం చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా మొక్కజొన్న, వరి పంటలు సాగు విస్తీర్ణం అధికంగా వుందని వాటి నష్ట నివారణ కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తుఫాన్ ప్రభావం వల్ల గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందచేయాలని తహశీల్దార్ మారుతిప్రసాద్ తెలిపారు.

# గ్యాంగ్‌రేప్ నిందితులను శిక్షించాలని పోలీసులకు ప్రజాసంఘాల ఫిర్యాదు

గోరంట్ల, అక్టోబర్ 13 ప్రభాతవార్త


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి గ్రామంలో ఉపాధి కోసం వచ్చిన ఉమ్మడి కుటుంబంలోని అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎలాంటి ఒత్తిళ్లను ఉపేక్షించకుండా చట్ట ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని గోరంట్ల పోలీసుస్టేషన్‌లో సిఐ బాబుకు ప్రజా సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఇందులో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, బాలికలపై అత్యాచాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం వచ్చిన అత్తాకోడలిపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడడం దుర్మార్గమని దీనిని తీవ్రమైన నేరంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుఉల నర్సింపల్లి ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గం కన్వీనర్ కొండా వెంకటేశులు, జిల్లా కమిటీ సభ్యుతి తిప్పన్న, కెవిపిఎస్ మండల నాయకులు పాలసముద్రం భాస్కర్, ఇళ్ల స్థలాల సాధన పోరాట సమితి నాయకులు రత్నమ్మ, నంజుండప్ప, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ పేరుతో నేటి నుండి పల్లెల్లో పంచాయతీ వారోత్సవాలు

గోరంట్ల, అక్టోబర్ 13 ప్రభాతవార్త


ఎంపిడిఒ

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పర్యవేక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 19వరకు గ్రామ పంచాయతీల్లో పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరేంద్రకుమార్ షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో భాగంగా ఈనెల 14న బూదిలి, నార్సింపల్లి, రెడ్డిచెరువుపల్లి, వడిగేపల్లి, 15న గోరంట్ల, మందలపల్లి, 16న గడ్డం తాండా, ఎగువ గంగంపల్లి, కొరావ్ప్లలపల్లితాండ, పుడగుండ్లపల్లి, 17న గౌనివారిపల్లి, మలసముద్రం, పులేరు. పాలసముద్రం, 18న కమ్మవారిపల్లి, కొండాపురం, వెంకటరమణపల్లి, 19న వానవోలు, వానవోలుతాండా పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శుల పర్యవేక్షణలో వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశాల్లో గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, చేపట్టబోయే అభివృద్ధి పనులపై నప్రజల మధ్య సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

# ఘనంగా కాలువ జన్మదిన వేడుకలు


అభిమానుల మధ్య కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

డి.హీరేహాళ్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:

రాయదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, తెదేపా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శనివారం దసరా పండుగతోపాటు ఎమ్మెల్యే కాలవ జన్మదిన వేడుకలు కావడంతో అటు దసరా శుభాకాంక్షలు, ఇటు ఆయన జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా నిర్వహించిచి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనంతపురం నుండి బయలుదేరి కణేకల్లు వద్ద వంతెన నిర్మాణం పనులకు భూమిపూజ చేసి రాయదుర్గం వస్తుండగా మార్గమధ్యంలో కొంతానపల్లి కొత్త కాలనీ వద్ద రహదారిపై ఆయన అభిమానులు తలారి రాజప్ప, హనుమాన్ జిరావ్, తెదేపా నాయకులు రాతిబావి వంక కృష్ణ, పవర్ ఎర్రిస్వామి తదితరులు ఎమ్మెల్యే కాలవతో కేక్‌కట్ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలలో ఆయన వాహనం దిగి రహదారి పైనే కేక్‌కట్‌చేసి అందరికి పంచగా వారు ఆయనకు పూలమాల, శాలువాతో సత్కరించి జన్మదిన, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధరశెట్టి, గొల్ల రామప్ప, మారెప్ప, మోపూరి అశోక్, కొంతానపల్లి ప్రకాష్, కొంతానపల్లి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# రూ.48కోట్లతో నూతన వంతెనకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తెదేపా నాయకులు

కణేకల్లు-కలేకుర్తి మధ్య వేదావతి నది గుండా నూతన బ్రిడ్జి నిర్మాణానికి విజయదశమి రోజున రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కోసం గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే రూ.40కోట్లు నిధులు న్యూడెవలప్మెంట్ బ్యాంక్(ఎన్‌డిబి)ద్వారా ప్రతిపాదించామని, అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోకుండా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లలేదని విమర్శించారు. ఇప్పటి పరిస్థితుల ప్రకారం ఆ ప్రాజెక్టు ఖర్చు రూ.48కోట్ల పెరిగిందని ఆయన తెలిపారు ఈ ప్రాజెక్టుకు సంబంధించి విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన మరియు ఆర్థికశాఖ మంత్రి, ఆర్అండ్‌బి శాఖ మంత్రి ఈ ప్రాజెక్టును సానుకూలంగా స్వీకరించినట్టు చెప్పారు. బ్రిడ్జి నిర్మాణాన్ని తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేయడమే లక్ష్యమని, ప్రజలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం కలిగేలా చేసి బాధ్యతను తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కాలవ జన్మదినం వేడుకలను మండల తెదేపా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులతో కలిసి తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఆయన చేతుల మీదుగా కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కలేకుర్తి లాలెప్ప, సుదర్శన్, ఆనందరాజులు, వేలూరి మరియప్ప, బీటీ రమేష్, మిల్ చంద్రశేఖర్‌గుప్తా, చాంద్‌బాసా, నాగభూషణం, ఎల్ఐసి గోపాల్, అనిల్, వెంకటేశులు చౌదరి అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ సిఐగా ప్రవీణ్‌కుమార్

గుంతకల్లు, అక్టోబర్ 13 ప్రభాతవార్త


బాధ్యతలు చేపట్టిన సిఐ ప్రవీణ్‌కుమార్

గుంతకల్లు రూరల్ సిఐగా ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఉరవకొండ సిఐగా పనిచేస్తున్న ఈయన బదిలీల్లో భాగంగా అక్కడికి రాగా గతంలో ఇక్కడ సిఐగా పనిచేస్తున్న మహేశ్వర్‌రెడ్డిని ఉన్నతాధికారులు విఆర్‌కు పంపారు. సిఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలతో పాటు అసాంఘికకార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరప్రవృత్తిని కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆయన సూచించారు. బాధ్యతలు చేపట్టిన సిఐకి సిబ్బందితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# జిఎన్ సాయిబాబా మృతి పీడిత ప్రజల ఉద్యమాలకు తీరనిలోటు

గుంతకల్లు, అక్టోబర్ 13 ప్రభాతవార్త


మాట్లాడుతున్న సురేష్

పౌరహక్కుల నేత, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా మృతి పీడిత ప్రజల ఉద్యమాలకు తీరనిలోటని సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసి పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి సురేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిబాబామృతికి కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ చర్యలే కారణమని ఆరోపించారు. 80 శాతం వికలాంగునిగా వున్న ఆయనను 2014లో అప్పటి బిజెపి ప్రభుత్వం మావోయిస్టులతో సంబంధాలు వున్నాయని అక్రమ కేసులు బనాయించి పది సంవత్సరాలు నాగపూర్ సెంట్రల్‌జైలులో బంధించిందన్నారు. ఆరోగ్యం పూర్తిస్థాయిలో క్షీణించినా జైలర్ అధికారులు చికిత్సలు అందించలేదని ఆరోపించారు. పదేళ్ల తరువాత 2024 మార్చిలో ఆయన నిర్దోశిగా విడుదల కావడమే బిజెపి కుట్రలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విడపనకల్లు, అక్టోబర్ 13 ప్రభాతవార్త


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న దృశ్యం

మండలంలోని ఎన్నావళిగి గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మురహరి తెలిపారు. గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందిలో కలిసి దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 20 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

03ATP13_03ATP13.qxd 13-10-2024 PM 10:14 Page 1



## 25వేల కోట్ల బకాయిలు సత్వరమే చెల్లించాలి

**- డిపో ఎరియర్లు సరెండర్ లీవులు చెల్లింపుకు తగిన చర్యలు తీసుకోవాలి : ఫోర్టో నేతలు**

**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



కరణం హరికృష్ణ



అంకాల కొండయ్య

అంతర్జాలంలో జరిగిన రాష్ట్ర ఫోర్టో కార్యవర్గ సమావేశంలో 25వేల కోట్ల బకాయిలు సత్వరమే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. డిఏ ఎరియర్లు సరెండర్ లీవులు చెల్లింపుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎస్ ఉద్యోగులకు ఏడి బకాయిలు నగదు రూపంలో చెల్లించాల్సిన వాటిని చెల్లింపుకు తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రాష్ట్ర ఫోర్టో నూతన కార్యవర్గం ఎన్నిక :

చైర్మన్‌గా కరణం హరికృష్ణ (ఎన్‌టిఏ), సెక్రెటరీ జనరల్‌గా అంకాల కొండయ్య (ఎస్ఎల్‌పిఏ), గౌరవాధ్యక్షులుగా టి.వెంకట్‌రెడ్డి (ఏపిఎంటిఎఫ్), ముఖ్య సలహాదారులుగా బలివాడ ధనుంజయ్ రావు(పిఎస్‌హెచ్ఎల్ఏ), కోశాధికారిగా చల్లగుండ్ల శ్రీనివాసరావు(ఎస్‌జిటిఎఫ్), మీడియా కన్వీనర్‌గా బోనాల రమేష్ (ఎస్సీ, ఎస్టీ, యుఎస్), కో చైర్మన్‌లుగా బృందలై (అపోటా), సోమరౌతూ శ్రీనివాసరావు(పిఎంటిఎఫ్), డి.విజయలక్ష్మి(ఎస్‌డబ్ల్యూటిఎం), ఎల్ దుర్గారావు(ఏపిఏఎన్ఓఏ), షేక్ కరీముల్లా (ఏపిఎస్‌పిఏ), సంయుక్త కార్యదర్శిలుగా పి.బీరప్ప(బిసిటియు), ఎస్.పెద్దన్న (డిటిడబ్ల్యూఏ), శివశంకర్‌రెడ్డి (ఎంఎస్‌పిటిఏ), బి.ఈరాలప్ప (కెటిఏ), ఆర్.వెంకటరమణ మూర్తి( ఏపిపి జిటిఏ), శ్రీహరికోటి యోహాన్ (ఆటా), అదికార ప్రతినిధులుగా మాగంటి శ్రీనివాసరావు (ఎన్‌టిఏ), గరికపాటి సురేష్ (ఎస్‌జిటిఎఫ్) తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దొడ్డ ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి అనుసంధానకర్తలుగా బలివాడ ధనుంజయ్‌రావు బృందభాన్ దొలై, కృష్ణ గుంటూరు పట్టభద్రుల శాసనమండలి అనుసంధాన కర్తగా మాగంటి శ్రీనివాసరావు, ఉభయగోదావరి ఉపాధ్యాయ శాసనమండలి అనుసంధానకర్తగా గరికపాటి సురేష్ వ్యవహరిస్తారు.

## పల్లె పండుగ వారోత్సవాల నిర్వహణకు నిధులు ఎక్కడ

**- డిప్యూటీ సిఎంను కోరిన సర్పంచులు.**

**అనంతపురం రూరల్,అక్టోబర్13ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయితీల్లో ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలు జారీ చేయడం జరిగిందని కానీ గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహునకు నిధులు ఎక్కడ డిప్యూటీ సిఎం అని వారు అడుగుతున్నారు.అసలే గ్రామాలలో నిధులు లేక అభివృద్ధి పనులకు కుంటు పడిందని పంచాయితీలకు వేయలవలసిన స్టాంపు అండ్ రిజిష్టేషన్ ఫిజులు వేయకపోవడంతో పంచాయితీలో నిధులు లేక చేసిన పనులకు బిల్లులు కాక తీవ్ర ఇబ్బందులు పడడంజరుగుతుందని,మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం రోజుకో పేరు పెట్టీ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పుతుండంతో ఆ కార్యక్రమాలు నిర్వహునకు నిధులు లేక ఎన్నో ఇబ్బందులు పడడం జగురుతుందని కావున గ్రామాల్లో ఏదైన కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంను,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కోరుతున్నమని సర్పంచులు తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం 29వవార్డు కౌన్సిలర్ కోటా సుశీలమ్మ, లక్ష్మీరెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిల అడుగుజాడల్లో సేవాకార్యక్రమాల్లో భాగంగా ఆసుపత్రిలోని దాదాపు 200 మంది రోగులకు ఈ భోజన వసతి కల్పించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పల్లెపండుగ వారోత్సవాలు

**పామిడి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



ఎంపిడిఓ తేజోష్ణ

మండలంలోని గ్రామ పంచాయితీల్లో గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ తేజోష్ణ ఆదివారం ప్రభాతవార్త ద్వారా తెలియజేశారు. ఈ నెల 14న అనుంపల్లి, దిబ్బసానిపల్లి, ఓలూరు, పాళ్యం, రామగిరి, రామరాజుపల్లి, 15న ఎద్దులపల్లి, 16న దేవరపల్లి, 17న ఖాదరపేట, 18న కండ్లపల్లి, సొరకాయలపేట, 19న ఎదురూరు, జి.కొట్టాల, పాళ్యం తండా, రామగిరి ఎగువతండా, వంకరాజుకాలువ, 20న గజరాంపల్లి, కత్రిమల, కట్టకిందపల్లి గ్రామ పంచాయితీల్లో గ్రామసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్న కుటుంబాలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం లక్ష్యానికి అనుగుణంగా ఏడాదికి కనీసం 100 రోజులు వేతన ఉపాధి కల్పిస్తూ ఈ పథకం ద్వారా వేతనదారులకు కల్పించిన హక్కులను అమలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేతన రేటు రూ.300 ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పని ప్రదేశంలో కూలీ మరణించిన లేక పూర్తిగా అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబానికి రూ.50వేల నష్ట పరిహారాన్ని అందించాలని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టం సూచిస్తోందని తెలిపారు. గ్రామసభల్లో గ్రామస్థుల ఆలోచనా విధానాలకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టబోయే అభివృద్ధి పనులను నిర్ణయించటం జరుగుతుందని ఎంపిడిఓ తేజోష్ణ వెల్లడించారు.

## వేరుశనగ పంట కోత వాయిదా వేసుకోండి

**- మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్‌కుమార్**

**శింగనమల, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల సంస్థ తెలిపిన మేరకు.. రాబోయే నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు పంట నష్టపోకుండా చర్యలు చేపట్టాలని మండల అధికారి ఎన్.అన్వేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. జిల్లాలో వేరుశనగ పంట కోత దశలో ఉందని ఈ సమయంలో పంట కోతను వాయిదా వేసుకోవాలని ఒకవేళ పంట కోత జరిగి ఉంటే తడవకుండా తార్పాలిన్ పట్టతో ఎత్తైన ప్రదేశాల్లో కప్పి ఉంచాలని లేదంటే పచ్చికట్టె నూర్పిడి చేసే యంత్రాల ద్వారా పంట నూర్పిడి చేయాలన్నారు. పత్తి పంట కోత దశలో ఉంది కాబట్టి వర్షానికి తడవకుండా పత్తి తీసి వేయాలని అదే విధంగా ఇతర పంటలు పూత దశలో ఉన్నందు వల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## ముంటిమడుగు కేశవరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బ్యాళ్ల నాగేంద్ర



పూల బొకేను అందిస్తున్న బ్యాళ్ల నాగేంద్ర

**శింగనమల, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో తెలుగుదేశం పార్టీ బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, టిఎన్‌టియుసి రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర, గార్లదిన్నె మండల కన్వీనర్ రంగనాయకులు, శ్రీనివాసులు, కల్లుమడి చిట్టి ఆయనను కలిసి పూలబొకేను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాల మధ్య నీటి కోసం వాగ్వివాదం

**నార్పల, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

నార్పల హెచ్ఎల్‌సి కెనాల్‌కు డిస్ట్రిబ్యూటర్లకు అధికారులు నీరు వదలడంతో నీటి కోసం శనివారం రాత్రి, కురగానపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాల రైతులు కాలవ వద్ద రాత్రి వాగ్వివాదం చేసుకున్నారు. కురగానపల్లి తూము వద్ద ప్రధాన కాలువకు గ్రామస్తులు అడ్డుకట్ట వేశారు. అడ్డుకట్ట తొలగిస్తేనే కాలువ ద్వారా నీరు గడ్డం నాగేపల్లి, వెంకటాంపల్లి, మద్దలపల్లి గ్రామాలకు తాగునీటి సమస్య తీరుస్తుందని, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి నీరు కావాలని వెంకటాంపల్లి గ్రామస్తులు వాదనకు దిగారు. వెంటనే ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## ఘనంగా ఐదుకల్లు సదాశివన్ 36వ వర్ధంతి



ఐదుకల్లు సదాశివన్ చిత్రపట్టానికి పూలమాల వేసి నివాళ్లుర్పిస్తున్న సిపిఐ నాయకులు

**అనంతపురం రూరల్,అక్టోబర్13ప్రభాతవార్త:**

కామ్రేడ్ ఐదుకల్లు సదాశివన్ 36వ వర్ధంతి ని సిపిఐ రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్ అధ్యక్షతన సమతా గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర వార్యదర్శి జగదీష్, న్యాయవాది ఐదుకల్లు సదాశివన్ కుమారుడు రవీంద్రనాథ్,జిల్లా కార్యదర్శి జాఫర్ హాజరై ఐదుకల్లు సదాశివన్ చిత్రపట్టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు కల్లు సదాశివన్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్కూల్ విద్య వరకు మాత్రమే అభ్యసించి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై బాల్యవలోనే హరిజనోద్దరణకు అహర్నిశలు శ్రమించిన మహోన్నతుడు ఐదుకల్లు సదాశివన్ అన్నారు.పేద,బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆయన స్వంతంగా ఒక హస్టల్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి వారికి అన్నంపెట్టిన వ్యక్తి సదాశివన్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిరుతల మల్లికార్జున,నారాయణస్వామి,రాజారెడ్డి,రామకృష్ణ, మల్లికార్జున, పద్మావతి,రాజేష్‌గౌడ్,రూరల్ మండల కార్యదర్శి రమేష్,సహాయ కార్యదర్శి అల్లీఫీరా,కుళ్లాయిస్వామీ,రామాంజినేయులు, జయలక్ష్మి,ధనుంజయ్య, నల్లప్ప,రెడ్డప్ప,బలరాముడు,కుళ్లాయప్ప,చాంద్‌బాషా,ప్రసాద్,ఫకృద్దీన్,అనేక మంది వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవిమాత గ్రామోత్సవం



వాసవిమాతను ఊరేగిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీవాసవిమాత గ్రామోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ముందుగా మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీకన్యకాపమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనం తరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవం అమ్మవారిశాల నుండి పోలీసు స్టేషన్ సర్కిల్ మీదుగా తిరిగి అమ్మవారిశాలకు చేరుకుంది. గ్రామోత్సవం ఆద్యంతం బాణసంచా మోతలు మంగళ వాయిద్యాల నడుమ సాగింది. అదేవిధంగా కళాకారుల ప్రదర్శన పట్టణవాసులను ముగ్ధులను చేసింది. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్, ఉపాధ్యక్షులు వంకదార చిన్న మద్దులేటి, కార్యదర్శి జయవరం అశ్వర్థరంగయ్య, సంయుక్త కార్యదర్శి భూమా సుబ్రమణ్యం, కోశాధికారి కుప్పం రత్నమయ్య, భక్తులు పాల్గొన్నారు.

## తాడిపత్రి జట్టు విజయం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



ప్రతిభ చూపిన క్రీడాకారులు

అనంత ప్రీమియర్ లీగ్ అండర్-15 క్రికెట్ పోటీల్లో తాడిపత్రి అండర్-15 జట్టు గెలుపొందింది. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం తాడిపత్రి అండర్-15, ఆత్మకూరు అండర్-15 జట్లు తలపడ్డాయి, ఇందులో సీనియర్ క్రికెటర్ చక్రదారి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. మొదట టాస్ గెలిచిన అత్మకూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 26.1 ఓవర్లలో 121 పరుగులకు అలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన తాడిపత్రి జట్టు 122 పరుగులు చేసి విజయం సాధించింది. తాడిపత్రి జట్టులో బురానుద్దీన్ 29 పరుగులు, లిఖిత్‌కుమార్‌రెడ్డి 23 పరుగులు, అభిరామ్ 22 పరుగులు సాధించారు. గెలుపొందిన జట్టుకు ఏటిఎల్ లలిత, సీనియర్ కోచ్ సాధిక్‌వలి, సీనియర్ క్రీడాకారులు, ఆత్మకూర్ కోచ్ రఫీ, తాడిపత్రి ఆర్డీటి క్రికెట్ కోచ్ భార్గవ్ అభినందనలు తెలిపారు.

## వందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు



బహుమతులు అందచేసిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గాంధీకట్ట సర్కిల్ వద్ద వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ కైవశం చేసుకున్న తాడిపత్రి వందన అకాడమీ బాలికల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో బాలికలకు బహుబతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు వరుణ్, రామాంజినేయులు, రత్నమయ్య, మహిళా సంఘం నాయకురాలు సావిత్రమ్మ, జమీలబి, ఎఐటియుసి నాయకులు ఉమాగౌడ్, రవికుమార్, రమణ, రత్నమయ్య, అబ్రహం, రామకృష్ణ, సంజన, పాలెం రాజు, తదితరులు పాల్గొన్నారు.

## చౌడమ్మతల్లికి పట్టువస్త్రాలు

**యల్లనూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పాతపేటలో వెలసిన శ్రీచౌడమ్మతల్లికి కోటవీధికి చెందిన కుప్పా వెంకటరామయ్య కుమార్తెలు కుప్ప జయలక్ష్మి, కుప్ప సరస్వతిలు పట్టుచీర ఒడిబియ్యం సమర్పించారు. అమ్మవారికి పూజలు జరిపించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

చౌడమ్మతల్లికి పట్టువస్త్రం ← సమర్పిస్తున్న దృశ్యం

## గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

**అనంతపురం క్లాక్‌టవర్,అక్టోబర్13,ప్రభాతవార్త**



వి.రాంభూపాల్

చిలమత్తూరు మండలం నల్లబొమ్మిదిపల్లి గ్రామంలో అత్తా కోడలు పై సామూహిక అత్యాచారం చేసిన నిందితులను వెంటనే గుర్తించి,కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు.బళ్లారి నుండి ఉపాధి కోసం వచ్చిన వాచ్మేన్ మరియు అతని కోడుకును కత్తులతో బెదిరించి అత్త,కోడలు పై సామూహిక అత్యాచారం జరగడం దారుణమన్నారు. దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఈలోపు బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.మహిళలపై ఇంత ధైర్యంగా అత్యాచారాలకు పాల్పడుతున్నారంటే శిక్షలు పడవని,రాజకీయ నాయకులు అండదండలు ఉంటాయనే ధైర్యం ఇందుకు కారణం.చిలమత్తూరు సంఘటన జిల్లా నుండి వలస వెళ్లిన అనేక కుటుంబాలను ఆందోళనకు గురిచేసింది.కలకత్తా డాక్టర్‌పై జరిగిన దారుణం మరువక ముందే ఇలాంటి ఘటన జరగడం సభ్యసమాజానికి సిగ్గు చేటు అన్నారు.బాలికల నుండి వృద్దుల వరకు అత్యాచారాలకు గురవుతున్నారు.వీటికి మూలం ప్రపంచీకరణ విధానాల్లోవుంది.సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ఫ్రోన్ విడియోలు చూస్తున్న నివారించడం లేదు.స్త్రీని వ్యాపార సరుకుగా మార్చి,అసభ్యంగా చూపించడం పెరిగింది.టివి ఎషోలు స్త్రీలను కించపరుస్తున్న ప్రభుత్వాలు నియంత్రించడంలేదు.సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం కాకుండా మూల కారణాలను పరిష్కరించాలని వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు.

## ప్రజలందరిని సల్లగా చూడమ్మ పెద్దమ్మ తల్లి



బోనాలు సమర్పిస్తున్న గ్రామ పెద్దలైయిన సూర్యనారాయణరెడ్డి కుటుంబసభ్యులు

**బుక్కరాయసముద్రం అక్టోబర్ 13 ప్రబాతవార్త**

ప్రజలందరిని సల్లగా చూడమ్మ పెద్దమ్మ తల్లి అంటూ బుక్కరాయ సముద్రం గ్రామ ప్రజలు పెద్దమ్మ తల్లిని ముక్కుకున్నారు.ఆదివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లికి దశరా పండుగ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు.అమ్మవారిని వివిద రకాల పుష్పలతో ప్రత్యేకంగా అలంకరించారు.శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులు వివిద రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారికి 6వ సంవత్సరంలో కూడ బోనాలు సమర్పినంచారు. మెట్టమెదట గ్రామ పెద్దలైయినా తిరుమల రెడ్డి సూర్యనారాయణరెడ్డి వారి ఇంటి నుండి భోనం సమర్పించారు.అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుండి బోనాలు అమ్మవారికి సమర్పించినవారిలో ఎంపీపీ దాసరి సునీత బోనాలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు.భక్తదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో విశేషపూజలు

**ఆత్మకూరు అక్టోబర్ 13 ప్రభాతవార్త**



మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం విశేషపూజలు నిర్వహించారు.అర్చకులు స్వామి వారికి పాలాభిషేకం నిర్వహించి,స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

## దసరాకు జీవం పోసుకున్న ఆర్జెసి ఆగ్రోస్ లిమిటెడ్

**బుక్కరాయసముద్రం అక్టోబర్ 13 ప్రబాతవార్త**

పరిశ్రమలకు కృషి బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రేకులకుంట గ్రామ సమీపంలో నెలకొన్న ఆర్జెసి ఆగ్రోస్ లిమిటెడ్ కంపెనీ,దశరాకు జీవం పోసుకున్నది. గత ఏడు సంవత్సరాల క్రితం అనివారి కారణాలవలన ఆగిపోయిన కంపెనీ,గతంలో విధులు నిర్వహించిన జిల్లా కలెక్టర్లు,ఎస్పీల, ఎంపీల చొరవతో తిరిగి ఎతనాల్ ఇంధనం తయారు చేయు కర్మాగారం ఫ్యాక్టరీ 150 కోట్ల పెట్టుబడితో ఆర్జెసి ఆగ్రోస్ లిమిటెడ్ నేడు నెలకొల్పుటకు సన్నాహాలు జరుగుతున్నట్లు కంపెనీ ఎండి జెసి రవీంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంపెనీ ప్రారంభం అయితే ప్రతి రోజు 150 మందికి ఉపాధి కల్పించబడును, బుక్కరాయసముద్రం మండలం చుట్టుప్రక్కల గ్రామాల్లో మొక్కజొన్న,జొన్న,వరి పండించు రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించబడును.ఈ పరిశ్రమ 2025 సెప్టెంబర్ నాటికి ఇతనాల్ ఉత్పత్తిని ప్రారంబించబడుతుందన్నారు.

## పల్లెపండుగ కార్యక్రమం ప్రారంభం

**ఆత్మకూరు అక్టోబర్ 13 ప్రభాతవార్త**

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను పల్లెపండుగ పంచాయితీ వారోత్సవాలు పేరట సోమవారం ప్రారంభించనున్నారు. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు,రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనుల్ని చేపట్టనున్నారు.ప్రభుత్వం చేపడుతున్న పల్లెపండుగ కార్యక్రమం మెదటిరోజు మండల పరిధిలోని పి.యాలేరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమం 14వ తేదిన పి.యాలేరు,15న,బి,యాలేరు,16 ముట్టాల, గొరిదిండ్ల,వి,డి,తాండా, 17న సనప,రంగంపేట, తోపుదుర్తి, 18,సింగంపల్లి, సింగంపల్లితాండా, తలుపూరు, 19న పంపనూరు, 20న మదిగుబ్బ, వడ్డిపల్లి, 21న పి,సిద్దరాం పురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ మంత్రి పరిటాల సునీత పాల్గొంటారు కావున కార్యకర్తలు,ప్రజలు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

## రూరల్‌లో 14 నుంచి 20 వరకు పల్లె పండుగ వారోత్సవాలు

**- అనంత రూరల్ ఎంపిడిఓ దివాకర్.**

**అనంతపురం రూరల్,అక్టోబర్13ప్రభాతవార్త:**

అనంత రూరల్ మండలంలో ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ వారోత్సాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రూరల్ మండల ఎంపిడిఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్నీ గ్రామ పంచాయితీలో పల్లె పండుగ వారోత్సవాల కార్యమ్రాలు నిర్వహించి గ్రామాల్లో ఎన్ఆర్‌జీఎస్ నీధులకు సంబందించిన పనులను ఎంపిపి,జెడ్పటిసి,ఆ గ్రామాల ఎంపటిసిలు, సర్పంచులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించడం జరుగు తుందన్నారు. 14న అక్కంపల్లి,ఇటుకలపల్లి, కందుకూరు, కురుకుంట,15న కాటిగానికాల్వ, కట్టకిందపల్లి, మన్నీల, రాచానపల్లి,రాజీవ్‌కాలనీ, 16న అనంత రూరల్, కక్కలపల్లి, కొడిమి, ఎన్ఎన్‌కుంట,17న ఆకుతోటపల్లి, పూలకుంట, సోమలదొడ్డి, 18న చిన్నంపల్లి, కక్కలపల్లి కాలనీ, కామారుపల్లి, రుద్రంపేట, ఉప్పరపల్లి, తాటిచెర్ల, 19న ఆలమూరు, 20న ఎ.నారాయణపురం,చియ్యేడు గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# రెండున్నర నెలలుగా కొనసాగుతున్న నియమాక ప్రక్రియ...!

- రెండు వారాల క్రితమే ఇంటార్వ్యూలు పూర్తి
- అయినా నేటికీ విడుదల కానీ ఎంపిక జాబితా
- సమగ్రశిక్షలో ఎక్కడికక్కడే ఆగిన పాలన
- ఇంటార్వ్యూలకు సరెండర్ అయిన టీచర్ హాజరు
- ఎస్ఆర్‌లో సరెండర్ అని రాయకపోవడమే కారణం
- తెలిసినా పట్టించుకోని జిల్లా యంత్రాంగం





**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

ఫారిన్ సర్వీస్ కింద ఖాళీ పోస్టులను భర్తీ చేయాల్సిన నియామక ప్రక్రియ రెండున్నర నెలలుగా కొనసాగుతూనే వుంది. రెండు వారాల క్రితమే ఇంటార్వ్యూలు పూర్తి అయినా కూడా నేటికీ ఎంపిక జాబితా విడుదల కాకపోవడం, ఇంటార్వ్యూలకు సరెండర్ అయిన టీచర్‌ను ఎంపిక చేయడం ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

అనంతపురం జిల్లా సమగ్రశిక్షలో ఈ ఎడాది జూలై ఆఖర్‌లో 8 సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈ ఖాళీ పోస్టులకు అధికారులు ఆగస్టు 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే 9వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చారు. 36 మంది అభ్యర్థులు, 107 దరఖాస్తులు వచ్చాయి. వెంటనే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నిర్వహించాల్సిన అధికారులు ఇరవై రోజులు తర్వాత అదే నెల 30వ తేదీ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. ఆ తర్వాత అర్హులైన వారిని ఇంటార్వ్యూలకు ఎంపిక చేయాల్సి వుంది. కానీ నెల రోజులు నిర్లక్ష్యం చేసి అక్టోబర్ 1వ తేదీ అసిస్టెంట్ కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈవో, ఏపీసీ, డైట్ ప్రిన్సిపాల్ కలిసి నిర్వహించిన ఇంటార్వ్యూలకు 14 మందిలో 13 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. ఇంటార్వ్యూలు ప్రక్రియ పూర్తి అయి ఇప్పటికీ రెండు వారాలు అవుతున్నప్పటికీ నేటికీ ఎంపిక జాబితాను విడుదల చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. దీంతో రెండున్నర నెలలుగా సమగ్రశిక్ష కార్యాలయంలోని ఆయా విభాగాల్లో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ విషయం జిల్లా యంత్రాగానికి తెలిసినా కూడా ఖాళీ పోస్టుల భర్తీ నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయకపోవడం గమనార్హం.

**ఇంటార్వ్యూలకు సరెండర్ అయిన టీచర్ రెబకా హాజరు :**

ఉమ్మడి అనంతపురం జిల్లా సోమందేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న ఇంగ్లీష్ టీచర్ రెబకా గతంలో అడ్డదారిలో సమగ్రశిక్ష జిసిడివోగా వచ్చారు. ఆమె విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తూ కేజీబీవీల పర్యవేక్షణను గాలికి వదిలేయడం వలన శింగనమల కేజీబీవీలో ఒకనెలలో రెండు సార్లు ఫుడ్ పాయిజన్ కావడంతో పాటు ఇతర కేజీబీవీల్లో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. అలాగే జిల్లా కార్యాలయానికి కూడా ఉదయం ఆలస్యంగా వచ్చి సాయంత్రం అందరికంటే ముందుగానే వెళ్లిపోతుందని సాక్షాత్తు ఆ కార్యాలయం ఉద్యోగులే చెబుతున్నారు. అంతే కాకుండా పలు కేజీబీవీల్లో మత ప్రచారాలు చేయిస్తున్నారనే ఆరోపణలు రావడంతో పలు సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో అప్పటి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికు కేంద్రం నుంచి షోకాజ్ నోటీసు వచ్చింది. అలాగే పత్రికల్లో కూడా కథనాలు రావడంతో అప్పటి ఆర్జేటీ వెంకట క్రిష్ణారెడ్డి ఇన్‌ఛార్జ్ డీఈవోగా పనిచేస్తున్నప్పుడు జిసిడివో రెబకాపై విచారణ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేశారని విచారణలో భయటపడటంతో ఆమెను వెంటనే మాతృశాఖ (విద్యాశాఖ)కు సరెండర్ చేశారు. ఆ టీచర్ తిరిగి తాజాగా సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసుకొని, ఇంటార్వ్యూకు హాజరుకావడం గమనార్హం. ఆమె గతంలో సరెండర్ అయిన విషయం సంబంధిత అధికారులు ఎస్ఆర్‌లో రాయకపోవడంతో ఇంటార్వ్యూలకు ఎంపిక చేసినట్లు సమగ్రశిక్షలోని ఓ అధికారి చెబుతున్నారు. ఇందుకు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే అని స్పష్టంగా అర్థం అవుతోంది. ఖాళీ పోస్టుల నియామకానికి సంబంధించిన ఫైల్‌ను జిల్లా కలెక్టర్‌కు పంపించిన తర్వాత త్వరగా తెప్పించుకోవాల్సిన బాధ్యత డీఈవో, ఏపీసీదే. కానీ డీఈవో, ఏపీసీ అలాంటి ప్రయత్నాలు ఏమాత్రం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ఖాళీ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ అడిగేందుకు డీఈవో బి.వరలక్ష్మికు వార్త విలేఖరి ఫోన్ చేయగా స్పందించలేదు.

**ఎంపిక జాబితా రాలేదు : సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు**

సమగ్రశిక్షలోని ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాము. దరఖాస్తుల పరిశీలన చేశాము. ఇంటార్వ్యూలు కూడా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను జిల్లా కలెక్టర్‌కు పంపించడం జరిగింది. ఇంకా ఎంపిక జాబితా రాలేదు. ఈ వారంలో ఎంపిక జాబితా విడుదల అవుతోంది.

**CHANGE OF NAME**

I, RACHHAVALE DADAPEERA (old name) S /o SHAIK RACHHAVALE SADAK SAB, Residing at 25-125 Masthananappa Street Old Town Ananthapuramu, 515001 A.P. Changing my name from RACHHAVALE DADAPEERA (old name) to SHAIK DADAPEERA (new name) . Hence forth, I am being SHAIK DADAPEERA for all transactions

**CHANGE OF NAME**

I, RACHHAVALE SHAKEERA (old name) W /o SHAIK DADAPEERA Residing at 25-125 Masthananappa Street Old Town Ananthapuramu, 515001 A.P. Changing my name from RACHHAVALE SHAKEERA (old name) to SHAIK SHAKEERA (new name) . Hence forth, I am being SHAIK SHAKEERA for all transactions

# నేటి నుండి పల్లె పండుగ వారోత్సవాలు




ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపర్తి (కలెక్టరేట్), అక్టోబర్ 13, ప్రభాతవార్త**

సమగ్ర గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వంఈ నెల 14వ తేది నుండి 19వ తేది వరకు నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాలను పుట్టపర్తి నియోజకవర్గంలో సోమవారం నుండి ప్రారంభిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారని, రూ.20కోట్లతో మండలంలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించున్నట్లు తెలిజేశారు. 14న ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన కొత్తచెరువులో ఈ భూమిజ కార్యక్రమాలు ప్రారంభమై, 15న పుట్టపర్తిమండలం కప్పలబండ, జగరాజు పల్లి, వెంకటగారిపల్లి, పెడపల్లి,, 16న బుక్కపట్నం, బుచ్చయ్యగారిపల్లి, సిద్దరాంపురం, 17న నల్లమాడ, 18న ఓడిచెరువు, సున్నందపల్లి, 19న అమడగూరు, గుండువారిపల్లి పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేయనున్నట్లుతెలియజేశారు.

# యల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న పరిటాల కుటుంబ సభ్యులు



**రామగిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

స్వస్తిశ్రీ క్రోది నామ సంవత్సరం, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వెంకటాపురంలో కొలువై ఉన్న శ్రీ యల్లమ్మ అమ్మవారు ఆదివారం శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.



అమ్మవారిని దర్శించుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులు

# ఎమ్మెల్యే కాలవకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



కాలవ శ్రీ నివాసులను సన్మానిస్తున్న దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం అర్బన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నివాసంలో టిడిపి నాయకులతో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు ఆలం నరసనాయుడు, తలారి ఆదినారాయణ, రాయల్ మురళీ, టిడిపి రాష్ట్ర నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, గంగారామ్, సుధాకర్‌నాయుడు, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, తెలుగుదేశం పార్టీ నాయకులు మ ణిరవి, ముత్యాలప్ప, మూర్తి, సిరిశాల రాంబాబు, ఇతర టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్‌ఎంపిలు, పిఎంపిల సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి

- ఆర్‌ఎంపిలకు అధికారుల వేధింపులు ఉండవు -ఎమ్మెల్యే కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపిలు, పిఎంపిల సమస్యలు పరిష్కరించేందుకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని హటకేశ్వరస్వామి కళ్యాణమంటపంలో నియోజకవర్గంలోని ఆర్‌ఎంపిల సమావేశంకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి మీ సమస్యలు తీసుకెళ్లతానని ఆయన హామీ ఇచ్చారు. ఎవరిపైనా ప్రభుత్వ పరంగా ఎటువంటి కక్షసాధింపు చర్యలు, అధికార వేధింపులు ఉండవని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు చాలా దగ్గరగా ఉండి, ప్రజలతో నిత్యం మమేకమౌతూ వారి సాధక బాధకాల్లో పాలు పంచుకొనే వారు ఆర్‌ఎంపిలు అన్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ప్రజలకు జబ్బులు చేస్తే ప్రాథమికంగా వైద్య సేవలు అందించే వైద్యులు మీరేనన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జిఎస్.ప్రసాద్, సుధాకర్, స్థానిక నాయకులు మల్లికార్జున, తిమ్మారెడ్డి, సురేష్, నియోజకవర్గంలోని ఆర్‌ఎంపిలు, పిఎంపిలు తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం వల్లనే గంజాయి బ్యాచ్ అరాచకాలు

- గ్యాంగ్‌రేప్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- బాధితులను పరామర్శించిన మంత్రి సవితమ్మ

**హిందూపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



మీడియాతో మంత్రి సవితమ్మ

హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలంలోని నల్లబొమనపల్లిలో జరిగిన గ్యాంగ్‌రేప్ బాధితులను హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో రాష్ట్ర బిసి సంక్షేమశాఖామంత్రి సవితమ్మ పరామర్శించారు. దసరా పండుగ రోజు శనివారం తెల్లవారుజామున అత్తాకోడలిపై జరిగిన ఈ దారుణ సంఘటన అనంతరం వారిద్దరితో పాటు వారి భర్తలను కూడా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంత్రి సవితమ్మ హుటావుటిన విజయవాడ నుండి ఆదివారం మధ్యాహ్నం ఇక్కడికి చేరుకుని ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సామామూహిక అత్యాచార ఘటన తీవ్ర బాధాకరమన్నారు. విషయం తెలిసినప్పటి నుండి ముఖ్యమంత్రి, హోంమంత్రి, తాను, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జిల్లా కలెక్టర్, ఎస్‌పిలతో పర్యవేక్షిస్తూనే వున్నామన్నారు. గత ప్రభుత్వం వైఫల్యాల కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఏపి ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోందని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న వైసిపి వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం మాకులేదని కౌంటర్ ఇచ్చారు. అమాయక మహిళలపై అతి దారుణమైన సంఘటన జరగడం బాధాకరమన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ నివాసానికి సమీపంలోనే అత్యాచారం జరిగిన సంఘటనను మంత్రి ఉదహరించారు. గత ఐదేళ్లలో గంజాయిని ప్రోత్సహించింది ఎవరో అందరికి తెలుసని గంజాయి వల్ల యువత పెడదారి పడుతోందన్నారు. అదేవిధంగా ఘటన జరిగిన 24 గంటలు గడవకముందే పోలీసులు నిందితులను పట్టుకున్నారని మొత్తం 6 మంది నిందితులు ఘటనలో వున్నారని వారంతా గంజాయికి అలవాటు పడినవారని అనేక కేసుల్లో నిందితులుగా వుండి జైళ్లకు కూడా వెళ్లొచ్చారని పోలీసుల విచారణలో తెలుస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిప శ్రీనివాసరావు, జిల్లా టిడిపి అధ్యక్షులు కొల్లకుంట ఆంజినప్ప, పట్టణ అధ్యక్షులు డిఇ రమేష్, రంగారెడ్డి, అశ్వర్థరెడ్డి, అరుణాచలరెడ్డి, భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో రహదారులను విస్తరించినా కంట్రోల్లోకి రాని ట్రాఫిక్

-విస్తరణలో డబుల్ రోడ్ నిర్మించినా ఒకవైపు రోడ్డుపై తోపుడుబండ్లు, వాహనాల పార్కింగ్

-అవసరాలకు మించిన ఆటోలతో,తోపుడుబండ్లతో జామ్ అవుతున్న ట్రాఫిక్




ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్ అవుతున్న దృశ్యం, మేడావీధిలో వాహనాలు ఇరుక్కుపోతున్న దృశ్యం

**కళ్యాణదుర్గం అక్టోబర్ 13 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం పట్టణానికి చుట్టు రింగు రోడ్డు నిర్మించినా,మున్సిపాలిటీ తొలి పాలకవర్గం చర్యలతో బొటాబొటిగా రహదారుల విస్తరణ జరిగినా పట్టణంలో మాత్రం ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించలేదు.పట్టణానికి చుట్టూ ఎక్కువగా గ్రామీణ ప్రాంతం ఉండటంతో వ్యాపారాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం, వైద్య చికిత్సల కోసం, చిల్లర వ్యాపారాల కోసం నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలు వస్తూనే ఉంటున్న నేపథ్యంలో పట్టణమంతా ఫ్లోటింగ్ పాపులేషన్‌తో రద్దీగా ఉంటుంది.పట్టణంలో 60అడుగుల వెడల్పుతో డ్రైనేజీలు, పుట్‌పాత్‌లు సరిగ్గా లేకుండా విస్తరించిన రహదారులు, రహదారుల మధ్యలో అడ్డదిడ్డంగా నిర్మించిన డివైడర్లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి బదులు మరింత ఇబ్బంది కల్గిస్తున్నాయనే భావనలు వ్యక్తం అవుతున్నాయి.పట్టణంలో ప్రధానమైన టీ సర్కిల్, గాంధీ సర్కిల్ పట్టణ నడిబొడ్డున ఉన్నందున ఇక్కడ ట్రాఫిక్ విపరీతంగా జామ్ అవుతూనే ఉంటుంది. గాంధీ సర్కిల్ నుండి కన్నేపల్లి-బ్రహ్మసముద్రం వైపు వెళ్లే పాత బస్సు రోడ్డు విస్తరణకు నోచుకోక అక్రమణలతో కుంచించుకు పోయింది. ఈ ప్రాంతంలో బంగారు వ్యాపారులు అధికంగా ఉండటంతో పాటు స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ ఉండటంతో ఈ రహదారిలో ట్రాఫిక్కు అటంకాలు మాటల్లో చెప్పలేనిరీతిలో ఉంటాయి. అరకొరగా విస్తరించిన రహదారుల్లో ఒకవైపు రోడ్డును తోపుడుబండ్లు, అటోస్టాండులు, పుట్‌పాత్ వ్యాపారులు అక్రమించుకుని ట్రాఫిక్కుకు కిక్కుస్తుంటారు. అంతేకాదు పేరుకే డబుల్ రోడ్డులాగా వాహనదారులతో పాటు పాదచారులు కూడా ఎవరూ ఎడమవైపు వెళ్లాలనే నిబంధన ఇక్కడ అమలులో లేదు. ఏ రోడ్డులోనైనా ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు, అటోలు, జీపులాంటి వాహనాలు నడుస్తూనే ఉంటాయి. ఏ ప్రధాన కూడలిలోనూ ట్రాఫిక్ పోలీస్ పోస్టు ఏర్పాటు చేయలేకపోయారంటే ఇక్కడ రహదారుల దుస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.రహదారి మధ్యలో పాతడ్రమ్ములులాంటి ఉంచి వాహనాలను మరలించాల్సిన దుస్థితి. ట్రాఫిక్ డ్యూటీలో ఉన్న పోలీసులు కనిపించి,కనిపించక ఏదో ఒక మూలలో ఉండి విజిల్ వేసుకుంటూ తమ ఉనికిని నిరూపించుకుంటూ ఉంటారు. పాపం వారు ఎండల్లో ఎంతోసేపు నిలుచుకునే అవకాశం లేకపోవడంతో ఎక్కడో నీడ ఉన్న చోట ఉండిపోయి డ్యూటీ చేస్తుంటారు.ఇటీవల కొత్తగా నిర్మించిన కంబదూరు బైపాస్ నుండి టీ సర్కిల్ వరకూ నిర్మించిన డబుల్ రోడ్డు కూడా డ్రైనేజీలు లేకుండా, డివైడర్లు కూడా లేకుండా కోర్టుల్లో స్టేలు తెచ్చుకున్న స్థలాలను వదలివేసి అస్తవ్యస్తంగా నిర్మించారు. దీనివల్ల కూడా వాహన ఛోదకులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదనే చెప్పాలి.కళ్యాణదుర్గంలో వాహనాలు యాక్సిడెంట్లు చేయకుండా నడిపితే ఎలాంటి టెస్టు లేకుండా డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చేయచ్చంటూ కామెంట్లు వినిపిస్తుంటాయి.పేరుకు మున్సిపాలియే గాని అ స్థాయిలో ఇక్కడ పరిస్థితులు,సౌకర్యాలు లేవనే చెప్పాలి. కళ్యాణదుర్గం మున్సిపాలిటీని అభివృద్ధి చేసి, సుందరీకరణ చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యేపైనే ప్రజలు అభివృద్ధి అశలు పెట్టుకుని వేచి చూస్తున్నారు. ఎపుడూ రద్దీగా ఉండే కళ్యాణదుర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు, ట్రాఫిక్ సమస్యలను పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిదులు ఎలా పరిష్కరించి మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తారో వేచి చూడాలి మరి.

# కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

**కొత్తచెరువు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



తహశీల్దార్ నీలకంఠారెడ్డి

విపత్తుల, వాతావరణ శాఖ సూచనల మేరకు ఈనెల 14,15,16 తేదీలలో మూడు రోజులు పాటు తుఫాన్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, మండల స్థాయిలో ప్రజలంద రూ అప్రమత్తంగా ఉండాలని కొత్తచెరువు తహశీల్దార్ నీలకంఠారెడ్డి తెలిపారు. విపత్తు సమయంలో ఎవరికి ఎలాంటి ఇబ్బందికలిగిన తహశీల్దార్‌కార్యాలయం నందు కామండ్‌కంట్రోల్ రూం ఏర్పాటు చేయడంజరిగిందని, ప్రజలు ఏదైనా విపత్తు సంభవించిన ఎడల 789320304 నెంబర్ లేదా తహశీల్దార్ 9493188362 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ళ నుండి బయటకు రాకూడదని, శిథిలావస్థలో ఉన్న పాత మిద్దెల్లో నివాసముండరాదని కోరారు.

# మట్కా నిర్వాహకుడు అరెస్ట్

**విడపనకల్లు, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



మట్కా నిర్వాహకున్ని అరెస్ట్ చేసిన దృశ్యం

మండలంలోని పాల్తూరు పోలీసు స్టేషన్ పరిధిలోని హావలిగి గ్రామంలో శనివారం మట్కా నిర్వాహకున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హావలిగి గ్రామంలో కొందరు మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ మురహరి సిబ్బందితోకలిసి దాడులు జరిపి మట్కా నిర్వాహకున్ని అదుపులోకి తీసుకుని అతని వద్దనుండి 10వేలరూపాయల నగదు, మట్కాపట్టీలు, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# అంబరాన్ని అంటిన దసరా ఉత్సవాలు

- అడుగడుగునా భక్తి పారవశ్యం
- అమ్మవారికి ఘనంగా పూజలు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసాలు

పట్టణంలో దసరా ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ ఏడాది భక్తులు రెట్టించిన ఉత్సాహంతో పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుర్గామాతను సర్వాంగసుందరంగా అలంకరించి పట్టుపీతాంబరాలు, వివిధ రకాల పుష్పాలతో విద్యుత్‌దీపకాంతులతో దర్శనమివడంతో భక్తులు పులకించిపోయారు. పట్టణపురవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం వేడుకగా సాగింది. గ్రామోత్సంలో బాణసంచా పేల్చి అనందించారు. మేళతాళాలనాడుమ సాంప్రదాయబద్దంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సీఐ చిన్నగౌస్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు

**ఉరవకొండ, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



సీఐ సయ్యద్ చిన్నగౌస్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సయ్యద్ చిన్న గౌస్‌ను ఉరవకొండ పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద, పాల గోవిందు, గోపాల్, రవీంద్రనాథ్ చౌదరి ఘనంగా సన్మానించారు. స్థానిక రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం రాత్రి సీఐ చిన్నగౌస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారు శాలువాకప్పి పూలమాలతో సన్మానించి జ్ఞాపికలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంపట్ల పూర్తి అవగాహన ఉన్న చిన్నగౌస్ రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టడం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం, ఆయన నేతృత్వంలో శాంతిభద్రతల పరిరక్షణ బాగుంటుందని అన్నారు.

# తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

జిల్లాలో ఈ నెల 14 నుంచి 16 వరకు భారీ వర్షాల సూచనల నేపథ్యంలో గ్రామాల్లోని చెరువులు, చెక్‌డ్యాంలు, పంట కాలువల్లో గండ్లు, లీకేజీలపై సంబంధిత అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకుని చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆదివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. కాలువల్లో అడ్డుగా ఉన్న రాళ్లు, వ్యర్థాలు తొలగించాలని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వేరుశనగ పంట కోత దశలో ఉందని, ఈ సమయంలో పంట కోతను వర్షాలు తగ్గే వరకు వాయిదా వేసుకోవాలన్నారు. వర్షపు నీటిని ఎక్కువ శాతం పొలాల్లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# భారీ వర్షసూచనతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



విపత్తుపై వీడియోకాన్ఫరెన్స్‌లోమాట్లాడుతున్నజిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి(కల్చరల్), అక్టోబర్ 13, ప్రభాతవార్త**

వతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 14,15,16 తేదీలలో భారీ వర్ష సూచన ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. ఆదివారం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం నందు సంయుక్త కలెక్టర్ అభిషేకుమార్, డిఆర్ఓ కొండయ్య, అడిషనల్ ఎస్‌పి ఆర్ల శ్రీనివాసులుతో కలసి డివిజన్,మండల స్థాయి అధికారులు,మున్సిపల్ కమీషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు,పునరావాస కేంద్రాలు, తదితర అంశాలపై పూర్తి అవగాహనతో పనులుచేపట్టాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముందస్తు చర్యలు కోసం ప్రజలను అప్రమత్తం చేయాలని, రహదారులు కోతకు గురికాకుండాచూడాలని, పంటలునష్టపోకుండా రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవానలి, అత్యవసర సహాయం కోసం విపత్తు నిర్వహణ సంస్థ అందుబాటులో ఉంటుందన్నారు. హైవేలు, మున్సిపల్,పంచాయతీ శాఖలు రడ్లపై వర్షం నీరు నిల్వఉండా చర్యలుతీసుకోవానలి, జిల్లాలోని నదీ తీర ప్రాంతాలైనచెరువులు,కుంటలు, వాటర్‌ఫాల్స్ వద్దకుప్రజలువెళ్లరాదని, లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత స్థానాలకుచేర్చాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు కూడా అధికారయంత్రాంగానికి తమపూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు లాటరీ విధానం ద్వారా మద్యం షాపుల ఎంపిక

**శ్రీసత్యసాయిజిల్లా, అక్టోబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి**

శ్రీసత్యసాయిజిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని సాయి అరామం నందు సోమవారం లాటరీ పద్ధతిద్వారామద్యం షాపుల లీజులను జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సమక్షంలో షాపులను ఎంపిక చేయడం జరుగుతుందని సంబంధిత శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని 87 మద్యం దుకాణాలకు దరఖాస్తుదారులు, వారి సెల్ అటెస్టేషన్ వ్యక్తుల హక్కుదారులు తమ ఐడి కార్డులతో పాటు హాజరు కావానలి, దరఖాస్తు దారుడైతే అతని ఎంట్రీ పాస్ తప్పనిసరిగా తీసుకురావాలని, లేదా అతని తరఫు వ్యక్తి అయితే అతని ఐడి కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఈ లాటరీ ప్రక్రియను పురస్కరించుకొని పోలీసు శాఖ తరఫున శ్రీసత్యసాయి జిల్లా అధికారిణి (ఎస్‌పి) వి.రత్న, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవవింద నాయక్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్ల నడుమ ఈ లాటరీ ప్రక్రియ నిర్వహించడంజరుగుతుందన్నారు. ఈ లాటరీ ప్రక్రియను పురస్కరించుకొని వాహనాలను మామిళ్ళకుంట క్రాస్ నుండి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రశాంతిపెట్రోల్ బంక్, గణేష్‌సర్కిల్, పోలీస్ గెస్ట్ హౌస్, కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ మళ్ళింపు జరిగిందన్నారు. 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున, దరఖాస్తు దారుడు తప్ప ఏ వ్యక్తి కూడా సాయిఅరామం వద్దకు ప్రవేశం లేదని, ఏవరైనా ఈ పరిసర ప్రాంతాలలోసంచరించిన యెడల చట్టరిత్యా చర్యలు తీసుకోవడంజరుగుతుందని హెచ్చరించారు. అభ్యర్థులు గ్యాస్‌గోడౌన్ లేదా కోవెగుట్టపల్లి క్రాస్ నుండి 500 మీటర్ల దూరంలో తమ వాహనాలు దిగి సాయిఅరామం ఫంక్షన్ హాలుకు వెళ్లవలసి ఉంటుందన్నారు. ఈ మద్యంషాపుల వేలం విషయంలో ఎవరైనానిబంధనలు అతిక్రమిస్తే చట్టరిత్యా చర్యలుతీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# నేడు ప్రజల సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం రద్దు

**పుట్టపర్తి, అక్టోబర్ 13, ప్రభాతార్త**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన ఈ నెల 14,15,16వ తేదీలలో భారీ వర్ష సూచనలు ఉన్నందున ప్రజల సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ తెలియజేశారు. కావున ప్రజలు ఈ విషయాన్నిగమనించి ఎంతో వ్యయప్రయాసాల కోర్చి జిల్లాకేంద్రానికి రావద్దని, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. అందరు ఆర్‌డిఓలు, మున్సిపల్ కమీషనర్లు, అన్ని మండలాల తహశీల్దార్, ఎంపిడిఓలు, ఎంఎస్‌ఓలు, సిఎస్‌ఓలు జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా కూడా ఎలాంటి దుర్ఘటన జరిగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**బుక్కపట్నం, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

ఈ నెల 14,15,16 తేదీలలో భారీ వర్ష సూచనలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, బలహీనమైన ఇళ్ళలో కాపురండుండేవారు వెంటనే మరోచోటుకు మారాలని, విద్యుత్ తీగలు, స్థంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలని,రైతులు, గొర్రెల కాపరులు, బాలింతలు,కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భవతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో మండల కంట్రోల్ రూం నెంబర్ 9441046182, 94923289653, 9490030129, 8008484277 నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు.